సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 3 । జనవరి । 2025



కాటేస్తున్న కాలుష్యం

జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన కర్మాగారాలతో పట్టణ ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. 8లో▸



ఏఓ కార్యాలయానికి తాళం

ధారూరు మండల వ్యవసాయ అధికారి అందుబాటులో ఉండటం లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



సర్పంచ్ ఆశలపై నీళ్లు!

ఎన్నో ఏళ్లుగా సర్పంచ్ పదవిపై ఆశలు పెట్టుకున్న నాయకులకు భంగపాటు తప్పలేదు. 9లో▸

పోస్టులు 3 ఒక్కరూ లేరు!

ముఖ్యమంత్రి ఇలాఖాలో సీడీపీఓల కరువు

- కొడంగల్ ఐసీడీఎస్‌లో ఇదీ పరిస్థితి
- ప్రాజెక్టు పరిధిలో 234 అంగన్‌వాడీ కేంద్రాలు
- సీనియర్ అసిస్టెంట్‌కు సీడీపీఓ బాధ్యతలు
- గాలిలో దీపంలా పర్యవేక్షణ



కొడంగల్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

వికారాబాద్: సీఎం లాంటి ఉన్నత పదవుల్లో ఉన్న వారి నియోజకవర్గాల్లో పాలన గాడి తప్పకుండా ఉండేందుకు సమర్థవంతమైన అధికారులను నియమించుకోవడం సహజం. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. పాలన గాడితప్పి ప్రభుత్వం విమర్శలపాలవుతోంది. ఇటీవల అనేక వివాదాలకు కేంద్రబిందువుగా మారినా చర్యలు తీసుకుంటున్నట్లు కనిపించడంలేదు. విద్యాశాఖ పరంగా సీఎం ఇలాఖాలో వందలాది పోస్టులు ఖాళీగా ఉండటంతో చదువు కునారిల్లుతోంది.. పీహెచ్‌సీల్లో వైద్యుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇదంతా ఒకెత్తయితే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మరీ అధ్వానంగా మారింది. కొడంగల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 234 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మూడు సీడీపీఓ పోస్టులు ఉండగా అన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో సీనియర్ అసిస్టెంట్‌కు బాధ్యతలు అప్పగించారు. కార్యాలయంలో రికార్డులు రాసే సీనియర్ అసిస్టెంట్‌కు సీడీపీఓగా బాధ్యతలు ఇవ్వటంపై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. కానీ ఫలితం కనిపించడం లేదు.

ఆరు నెలలుగా ఇదే పరిస్థితి

రాష్ట్రంలో 150 పైచిలుకు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా కేవలం రెండు చోట్ల మాత్రమే ప్రాజెక్టుకు మూడు చొప్పున సీడీపీఓ పోస్టులు ఉన్నాయి. అందులో కొడంగల్ ఒకటి. జిల్లాలో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు (వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్, మర్పల్లి) ఉండగా.. వీటి పరిధిలో 1,107 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ సెంటర్ల పరిధిలో సగటున 60 వేల పైచిలుకు చిన్నారులు, 6,100మంది గర్భిణులు, 5,900మంది బాలింతలు ఉన్నారు. నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులకు నలుగురు రెగ్యులర్ సీడీపీఓలు ఉన్నారు. కానీ మూడు సీడీపీఓలు ఉన్న సీఎం సొంత నియోజకవర్గంలో ఒక్కరుకూడా లేకపోవడం గమనార్హం. దీంతో కార్యాలయంలో విధులు నిర్వహించే సీనియర్ అసిస్టెంట్‌కు (ఎఫ్ఎస్‌సీ) బాధ్యతలు అప్పగించారు. ఆరు నెలలుగా ఇదే పరిస్థితి ఉంది. గతంలో ఈ విషయంపై స్థానికులు కడా ప్రత్యేక అధికారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. కలెక్టర్ స్పందించి సీడీపీఓలను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

అంతా మాజీ కనుసన్నల్లోనే..

గతంలో కొడంగల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓగా పని చేసిన వ్యక్తి ఇన్‌ఫ్లుయెన్స్ చేసి అక్కడికి కొత్త వారు రాకుండా అడ్డుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. గతంలో ఇక్కడ పనిచేసిన వ్యక్తిపై అనేక ఆరోపణలు రావడంతో లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఉన్నతాధికారులు స్పందించి ఆయన్ను గుట్టుగా బదిలీ చేశారు. తిరిగి ఇక్కడికే రావాలనే ఉద్దేశంతోనే ఆయన కొత్తవారు రాకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తాను తిరిగి వచ్చేదాకా సీనియర్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జ్ సీడీపీఓగా బాధ్యతలు ఇప్పించేలా ఇన్‌ఫ్లుయెన్స్ చేశారని సమాచారం. సాధారణంగా సీడీపీఓ పోస్టు ఖాళీగా ఉంటే పక్క నియోజకవర్గానికి చెందిన ప్రాజెక్టు సీడీపీఓలకు అదనపు బాధ్యతలు అప్పగించాలి. కానీ ఇక్కడ అందుకు విరుద్ధంగా సీనియర్ అసిస్టెంట్‌కు ప్రాజెక్టు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిస్తోంది. మూడు పోస్టులు ఉన్న కొడంగల్ ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఒక్క సీడీపీఓ కూడా విధుల్లో చేరకపోవడం గమనార్హం.



బీజీ కెనాల్ తూమును మూసివేస్తున్న సిబ్బంది, రైతులు

సాక్షి ఎఫెక్ట్..

నీటి వృథాను అరికట్టండి

- ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రెడ్డి
- కోట్‌పల్లి బీజీ కెనాల్ తూమును మూసేసిన సిబ్బంది

ధారూరు: సాగునీరు అడవి పాలు అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి గురువారం వికారాబాద్ ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రెడ్డి స్పందించారు. కోట్‌పల్లి ప్రాజెక్టు బీజీ కెనాల్‌పై ఉన్న కల్వర్టు దెబ్బతినడంతో పంట పొలాలకు వెళ్లాల్సిన నీరు వృథాగా అడవిలోకి వెళుతోంది. ఈఈ ఆదేశాలతో తూము షట్టర్‌ను ఇరిగేషన్ సిబ్బంది తాత్కాలికంగా మూసివేశారు. దెబ్బతిన్న కల్వర్టును బాగు చేయించిన తర్వాత నీటిని విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. 15 రోజుల నుంచి నీరు వృథా పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

బొంరాస్‌పేట పీఎస్‌లో నరేందర్‌రెడ్డి విచారణ



మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: ఫార్మా కంపెనీ కోసం భూసేకరణ, కాంగ్రెస్ పార్టీ దుద్యాల మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్‌పై జరిగిన దాడిలో నిందితు డిగా నమోదైన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి గురువారం విచారణకు హాజరయ్యారు. నేరం నంబరు 145/2024 కేసులో మొదటిసారి బొంరాస్‌పేట పీఎస్‌కు వచ్చారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విచారణ కొనసాగింది. 3 గంటల పాటు విచారణ అధికారి అడిగిన సుమారు 70 రకాల ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. విచారణకు నరేందర్‌రెడ్డి సహకరించారని ఎంక్వైరీ అధికారి తెలిపారు. డీఎస్పీ శ్రీనివాస్, కొ డంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షించారు. మరో వారం రోజుల్లో రెండోసారి విచారణకు పిలిచే అవకాశం ఉందని ఎస్ఐ రవూఫ్ తెలిపారు.



ముఖ్యమంత్రితో సమావేశమైన లగచర్ల, హకీంపేట్ గ్రామాల నాయకులు

లగచర్ల కేసులు ఎత్తివేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన లగచర్ల, హకీంపేట్ నాయకులు
- రైతు కుటుంబాల బాధ చూడలేకే మీ వద్దకు వచ్చాం
- భూ పరిహారం పెంచాలని విన్నపం
- ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడి

దుద్యాల్: లగచర్ల ఘటనలో రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కాంగ్రెస్ పార్టీ లగచర్ల, హకీంపేట్ గ్రామాల నాయకులు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సమావేశమై ఈ మేరకు విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత ఏడాది నవంబర్ 11న లగచర్ల ఘటనలో రైతులపై ప్రభుత్వం పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనుకోకుండ జరిగిన ఘటనలో చాలా మంది అమాయక రైతులు కేసుల్లో ఇరుక్కున్నారని, వారి కుటుంబాల బాధను చూడలేక మీ వద్దకు వచ్చినట్లు తెలిపారు. కేసులు ఎత్తివేయాలని కోరారు. అలాగే పారిశ్రామిక వాడ కోసం భూములు ఇచ్చే రైతులకు పరిహారం పెంచాలని కోరారు. దీనిపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. కొంతమంది ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని.. అలాంటి వారితో మాట్లాడి అపోహలు తొలగించాలని సీఎం సూచించినట్లు చెప్పారు. రైతులతో మాట్లాడి అభివృద్ధికి సహకరించేలా చూడాలని అన్నట్లు తెలిపారు. కొత్తగా ఏర్పడిన దుద్యాల్ మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో లగచర్ల మాజీ సర్పంచ్ అనంతయ్య, కాంగ్రెస్ పార్టీ దుద్యాల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, హకీంపేట్ మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, లగచర్ల ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవి కుమార్, నాయకుడు యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా రంగానికి ప్రోత్సాహం

- నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి

కడ్తాల్: రాష్ట్రంలో క్రీడా రంగాన్ని ప్రోత్సాహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీల ఏర్పాటుకు కృషి చేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి అన్నారు. మండల కేంద్రంలో గూడూరు నారాయణరెడ్డి స్మారకార్థం ఆయన కుమారుడు జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వనపర్తిలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం జరుగుతోందని తెలిపారు. వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలుగులోకి తెచ్చే విధంగా ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తోందని అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ చైర్ పర్సన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ మల్లురవి

కొత్త మెనూ అమలు చేయండి

- కలెక్టర్ ప్రతీక్ జైన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వికారాబాద్‌లోని కలెక్టరేట్‌లో ఎస్సీ, బీసీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖల జిల్లా అధికారులతో కొత్త మెనూ అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త మెనూ విధిగా అమలు చేయాలని, విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలని ఆదేశించారు. వసతి గృహాల్లో చిన్నచిన్న సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్స్, కిటికీలు, తలుపులను సరి చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 700 శునకాలకు జనన నియంత్రణ ఆపరేషన్లు చేయించినట్లు వివరించారు. వీధి కుక్కలను పట్టుకోవడానికి ఆంధ్రా ప్రాంతానికి చెందిన వ్యక్తులను నియమించామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీఓ శ్రీనివాష్, ఎస్సీ, బీసీ, గిరిజిన, మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారులు మల్లేశం, ఉపేందర్, కమలాకర్ రెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ కాదు.. ఫ్యూచర్‌సిటీనే..

యాచారం: యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల సరిహద్దులో ఫార్మాసిటీ రాబోదని, ఫ్యూచర్‌సిటీనే ఏర్పాటు చేస్తామని.. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. నక్కర్త మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన పలువురు రైతులు గురువారం యాచారంలోని ఆయన నివాసంలో ముదిరెడ్డి కోదండరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీకి భూములు సేకరించిన ప్రాంతంలోనే ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నాయిని సుదర్శన్ రెడ్డి, బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం తాగేందుకు రూ.100 ఇవ్వలేదని..

- బావిలో దూకి పశువుల కాపరి ఆత్మహత్య
- తాండూరు మండలం కరన్‌కోట్‌లో ఘటన



నరేశ్ (ఫైల్)

తాండూరు రూరల్: మద్యం తాగేందుకు యజమాని డబ్బులు ఇవ్వలేదని మనస్తాపానికి గురైన ఓ పశువుల కాపరి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన తాండూరు మండలం కరన్‌కోట్‌లో గురువారం వెలుగుచూసింది. ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోలేపల్లి నరేశ్ (23) ఇదే ఊరికి చెందిన కొడంగంటి రాములు వద్ద పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. ఐదు రోజుల క్రితం తనకు జీతం డబ్బులు ఇవ్వమని రాములును అడగగా.. తాగి వృథా చేస్తాడనే ఉద్దేశంతో తిరస్కరించాడు. ఈ విషయాన్ని నరేశ్ తన సోదరుడు లక్ష్మప్ప, బాబాయి వెంకటప్పకు చెప్పడంతో గత నెల 30న యజమాని నుంచి రూ.3,500 ఇప్పించారు. అనంతరం కొత్త సంవత్సరం సందర్భంగా గత బుధవారం తనకు రూ.100 ఇవ్వమని నరేశ్ యజమానిని అడిగాడు. డబ్బులిస్తే.. మద్యం తాగి పశువులు కాసేందుకు వెళ్లడని భావించిన రాములు తన వద్ద లేవని చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన నరేశ్ గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు రాత్రి 9గంటలకు బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం అనంతరం గురువారం ఉదయం నరేశ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నరేశ్‌కు వివాహం కాలేదు. తల్లి, సోదరుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చూసుకునేవారు లేక.. ఆస్పత్రిలో చేర్చుకోక..

- మధుమేహం వ్యాధితో పరిగి ప్రభుత్వ దవాఖానాకు రోగి
- కాలికి గాయం.. వైద్యం చేసి బయటకి పంపిన సిబ్బంది
- చెట్టుకింద సేద తీరుతున్న వైనం



ఆస్పత్రి బయట చెట్టుకింద నిద్రిస్తున్న గోపాల్

పరిగి: ఓ వైపు మధుమేహం వ్యాధి.. ఆపై కాలికి గాయం.. సెప్టిక్ అయ్యి చీము కారుతోంది.. తోడు ఎవరూ లేరు.. ఇన్ని సమస్యలతో ఆస్పత్రికి వచ్చిన రోగికి నామమాత్రం వైద్యం చేసి బయటికి పంపేశారు. రాత్రంతా చలికి వణికిపోతూ.. భోజనం లేక రోగి పడిన బాధలు వర్ణణాతీతం.. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పరిగి మండలం రాపోల్ గ్రామానికి చెందిన చాలకి గోపాల్ షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఏడేళ్ల క్రితం భార్య కూతురితో సహా వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. ఇటీవల కాలుకు గాయం కావడంతో అది కాస్తా పెద్దగా మారి చీము కారుతోంది. బాధ భరించలేక బుధవారం గోపాల్ 108కు కాల్ చేశాడు. సిబ్బంది రోగిని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి సిబ్బంది మొక్కుబడిగా వైద్యం చేశారు. గోపాల్‌ను చూసుకోవడానికి ఎవరూ లేకపోవడంతో ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకోలేదు. ఆస్పత్రి బయట ఉన్న చెట్టు కింద ఉండమన్నారు. రెండు రోజులుగా అక్కడే ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. ఆకలితో అలమటించాడు. గురువారం ఉదయం అటుగా వచ్చిన విద్యార్థులతో ఆకలిగా ఉందని చెప్పడంతో వారు టిఫిన్ తెచ్చి ఇచ్చారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని, మెరుగైన వైద్యం అందించాలని రోగి కోరారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్‌ను వివరణ కోరగా.. రోగిని ఆస్పత్రిలో చేర్చుకుంటున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రకృతి వ్యవసాయం వైపు నడవాలి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

నవాబుపేట: రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని కేశవపల్లిలో కూరగాయల పంటలను పరిశీలించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై సూచనలు చేసి అభిప్రాయాలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. త్వరలో మండల వ్యవసాయాధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జ్యోతి, ఏఈఓ ఆదిల్, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపి దుప్పట్లు అందజేస్తున్న డీపీఆర్‌ఓ తదితరులు

అనంతగిరి: కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను గురువారం పౌర సంబంధాల శాఖ జిల్లా అధికారి చెన్నమ్మ తన సిబ్బందితో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం తెచ్చిన దుప్పట్లను కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్లు సుధీర్, లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పీఆర్‌ఓ ప్రభాకర్, కార్యాలయం సిబ్బంది, టీఎస్ఎస్ కళాకారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భూ సర్వే



హకీంపేట్‌లో భూ సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

దుద్యాల్: మండలంలో పారిశ్రామిక వాడ ఏర్పాటులో భాగంగా చేపట్టిన భూ సేకరణ సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. హకీంపేట్, పోలేపల్లి, లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాలో పారిశ్రామిక వాడ ఏర్పాటులో ప్రభుత్వం వేగం పెంచింది. హకీంపేట్ గ్రామ సర్వే నంబర్ 252లో భూముల సర్వే కొనసాగుతోంది.ఈ సర్వే నంబర్‌లో 351 ఎకరాల భూమి ఉందా? పట్టాదారుడు సాగులో ఉన్నాడా అనే వివరాలు సర్వే నంబర్ ఆధారంగా గుర్తిరచేందుకు ప్రయత్నిస్తున్నారు. సర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని తహసీల్దార్ కిషన్ తెలిపారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వీరేశ్ బాబు,ఆర్ఐలు,సర్వేయర్లు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ క్రెడిట్ కార్డుతో ప్రయోజనాలు



మాట్లాడుతున్న మత్స్యశాఖ అధికారులు

అనంతగిరి: పీఎం కిసాన్ క్రెడిట్ కార్డుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని.. మత్స్యకారులకు కార్డును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్య శాఖ అధికారి వెంకయ్య సూచించారు. గురువారం వికారాబాద్ మండలం గొట్టిముక్కుల గ్రామంలో పీఎం కిసాన్ క్రెడిట్ కార్డుపై మత్స్య సహకార సంఘం ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారులు ఖాతా ఉన్న బ్యాంకులను సంప్రదించి రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణం పొందితే 2శాతం వడ్డీ మాత్రమే పడుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలను జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సదానందం, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్

తాండూరు టౌన్: తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం పరిగిలో జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాజుల బస్వరాజ్, చంద్రమోహన్‌లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పరిగిలోని ప్రభుత్వ నంబర్‌వన్ పాఠశాలలో ఉదయం 10.30 గంటలకు ఉంటుందన్నారు. గత నెల 30వ తేదీన మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన తెలుగు, ఆంగ్ల మీడియం విద్యార్థులు ముగ్గురు చొప్పున ప్రతి మండలం నుంచి ఆరుగురు ఈ టెస్ట్‌కు హాజరుకావాలని కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన దౌల్తాబాద్ నాయకులు



సీఎంకు మండల సమస్యలు వివరిస్తున్న నాయకులు

దౌల్తాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రేవంత్ ముఖ్యమంత్రి కావడంతో కొడంగల్ నుంచి తిరుపతి వరకు పాదయాత్ర చేసిన మహిపాల్‌ను సీఎం అభినందించారు. కార్యక్రమంలో మండల నాయకులు వెంకట్‌రెడ్డి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి వెళ్లిన బాలుడి అదృశ్యం



సమీర్ (ఫైల్)

తాండూరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లిదండ్రులు గురువారం పోలీసులను ఆశ్రయించారు. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పాత తాండూరు గడి ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫేరోజ్ కుమారుడు మహ్మద్ సమీర్(14) స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. బుధవారం పాఠశాలకు సెలవు కావడంతో మధ్యాహ్నం మజీదులో ప్రార్థన చేసి బయట కొద్ది సేపు కూర్చున్నాడు. రాత్రి అయినా సమీర్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన ఇళ్లల్లో వెతికారు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బాలుడు సాయంత్రం రైల్వే స్టేషన్ వైపు వెళ్లినట్లు సీసీ ఫుటేజీల్లో కనిపించాడని, అతని కోసం గాలింపు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

వాహనాన్ని తప్పించబోయి ప్రమాదం


కుల్కచర్ల: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మండలంలోని సాల్వీడు గ్రామానికి చెందిన చీపిరి అంజిలయ్య కుల్కచర్ల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్న క్రమంలో పాంబండ దేవాలయ సమీపంలో ఎదురుగా కారు రావడంతో తప్పించబోయి కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన ఆయన్ని గమనించిన స్థానికులు 108కి సమాచారాన్ని అందించి పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం నిమిత్తం అతన్ని నగరంలోని నిమ్స్ తరలించినట్లు సమాచారం. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కాటేస్తున్న కాలుష్యం

జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన కర్మాగారాలతో పట్టణ ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాటి నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, రసాయనాలతో గాలి, నీరు కలుషితమై అనారోగ్యం పాలవుతున్నారు. కాలుష్యపు కోరల నుంచి కాపాడాలని పోరుబాట పట్టినా.. పట్టించుకునే వారు కరువయ్యారు.

- జనావాసాల్లో పరిశ్రమలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- ఆదిబట్లలో ఆందోళన బాటపట్టిన ప్రజలు
- పట్టించుకోని పాలకులు, పీసీబీ అధికారులు





బొంగ్లూర్ సమీపంలోని పరిశ్రమ నుంచి వెలువడుతున్న పొగ (ఇన్‌సెట్లో) రైస్‌మిల్లు నుంచి..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని బొంగ్లూర్, ఎంపీపటేల్‌గూడ, మంగళ్‌పల్లిలో శ్రీశ్రీ అంతఃపురం, శివారెడ్డి నగర్, మెట్రోసిటీ, మైహోమ్స్ కాలనీ, సీఎంఆర్ రిచ్ మిడాస్, సప్తగిరి, గంగానగర్ కాలనీలలో సుమారు రెండు వేల మంది ప్రజలు నివాసం ఉంటారు. అటు హైదరాబాద్ ఇటు ఇబ్రహీంపట్నంకు మధ్యలో అనువైన ప్రదేశం కావడంతో ఈ ప్రాంతంలో అనేక మంది నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. టీసీఎస్ ఉద్యోగులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సామాన్య ప్రజలు సైతం నివాసం ఉంటున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. క్రమంగా పెరుగుతున్న కర్మాగారాల సంఖ్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలుష్యకోరల్లో చిక్కుకుని అల్లాడిపోతున్నారు.

నలభై పరిశ్రమలు

నగరానికి, కలెక్టరేట్ తదితర కంపెనీలకు పురపాలిక ప్రాంతం అనువైనదిగా పేరు గాంచింది. దీంతో ఈ ప్రాంతంలో అనేక మంది నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు, చేసుకుంటూనే ఉన్నారు. ఇళ్లతో పాటే జనవాసాలకు దగ్గరగా చుట్టూరా సుమారు 40 వరకు పరిశ్రమలు ఉండటంతో పరేషాన్ అవుతున్నారు. రైస్‌మిల్లులు, ప్లేవుడ్, ఆయిల్, బిస్కెట్, కుర్‌కురేతో పాటు చిన్నచిన్న కంపెనీలు భారీగానే వెలిశాయి. వీటి నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, రసాయనాలతో గాలీ, నీరు కలుషితమై.. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పొగ నుంచి వచ్చే దుమ్ముధూళి కణాలతో అస్వస్థతకు గురవుతున్నారు. ఇప్పటికే పది మందికి పైగా చర్మ, ఊపిరి సంబంధిత రోగాలతో ఆస్పత్రుల పాలయ్యారని స్థానికులు పేర్కొంటున్నారు.

ఉద్యమాలు చేసినా..

కాలుష్యంతో కలత చెందిన ప్రజలు.. ఏకంగా కాలుష్య వ్యతిరేక పోరాట సమితి పేరుతో కొంతకాలంగా పోరాటం చేస్తున్నారు. కాలుష్య కారక కంపెనీలను తరలించాలని కలెక్టర్, ఆదిబట్ల మున్సిపాలిటీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బొంగ్లూర్ చౌరస్తాలో ధర్నా, రస్తారోకోలు చేపట్టారు. పటేల్‌గూడలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ.. ఏ అధికారులు స్పందించడం లేదని ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రజలను కాపాడండి..



కాలుష్య కారక కంపెనీలను తరలించాలని చాలా కాలంగా పోరాటం చేస్తున్నాం. పార్టీలకు అతీతంగా మున్సిపాలిటీ ప్రజలు ఉద్యమిస్తున్నప్పటికీ.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి. కాలుష్యం నుంచి ప్రజలను కాపాడాలి. లేని పక్షంలో ఉద్యమం తీవ్రం చేస్తాం.

– జి.నర్సింహారెడ్డి, స్థానికుడు, ఎంపీపటేల్‌గూడ

ఇళ్లను వదిలిపెడతాం..



కాలుష్యం వెదజల్లుతున్న కంపెనీలతో పుర ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ఆ కర్మాగారాలను జనవాసాలకు దూరంగా తరలించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి. లేదంటే ఇళ్లను వదిలిపెట్టి వెళ్లిపోవాల్సి వస్తుంది. అధికారులు వెంటనే స్పందించాలి.

– రాజు, కాలుష్య వ్యతిరేక పోరాట సమితి నాయకుడు

తాగు నీటికి ఇబ్బంది

- నాలుగు రోజులుగా నిలిచిన మిషన్ భగీరథ వాటర్
- దుద్యాల్‌లో ట్యాంకర్‌తో సరఫరా




ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

దుద్యాల్: మిషన్ భగీరథ పైపు లైన్ పగిలి పోవడంతో దుద్యాల్‌వాసులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. నాలుగు రోజుల నుంచి నీటి సరఫరా నిలవడంతో కనీస అవసరాలకు ప్రజలు తల్లడిల్లుతున్నారు. దీంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా నీరు అందిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బంది నిత్యం ట్యాంకర్లలో నీటిని నింపుకొని ఉదయం నుంచి రాత్రి వరకు సరఫరా చేస్తున్నారు. అయినా తమ అవసరాలకు నీరు సరిపోవడం లేదని ప్రజలు మొర పెట్టుకుంటున్నారు. సాధారణ సమయంలో కూడా మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువతి పేరుతో చాటింగ్

- పార్ట్ టైం జాబ్ అంటూ యువకుడికి టోకరా
- రూ.1.16 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు



యువతి పేరుతో టెలిగ్రాం ద్వారా వచ్చిన మెసేజీలు

తాండూరు టౌన్: పార్ట్ టైం జాబ్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ యువకుడికి టోకరా వేశారు. మాయ మాటలు చెప్పి అతని నుంచి నగదును కొట్టేశారు. మోసపోయానని గ్రహించిన సదరు యువకుడు పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాండూరు పట్టణానికి చెందిన ఓ యువకుడికి పార్ట్ టైం జాబ్ చేసి డబ్బులు సంపాదించవచ్చని టెలిగ్రాం చానల్ ద్వారా ఆరతి అనే యువతి పేరుతో మెసేజీలు వచ్చాయి. టాటా ప్రాజెక్టుకు సంబంధించిన 20 ప్రాపర్టీస్‌ను ప్రమోట్ చేస్తే రూ.1000 వస్తుందని నమ్మబలికింది. ఏకంగా ప్రముఖ కంపెనీ టాటా పేరుతో జాబ్ ఆఫర్ రావడంతో యువకుడు నమ్మాడు. తన వివరాలతో పాటు బ్యాంకు ఖాతా నంబర్ కూడా ఇచ్చాడు. మొదట్లో రూ.1000 చొప్పున యువకుడి ఖాతాలో వేశారు. అయితే పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలంటే కంపెనీకి కొంత నగదు చెల్లించాలని చెప్పారు. దీంతో పలు దఫాలుగా రూ.1.16 లక్షలు వారికి సమర్పించాడు. ఆ తర్వాత అతని ఖాతాలోకి ఒక్కపైసా కూడా జమ కాకపోవడంతో మోసపోయానని గ్రహించాడు. ఈ మేరకు గురువారం స్థానిక డీఎస్పీ బాలకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. సైబర్ నేరగాళ్లు అనేక మార్గాల్లో నగదు కొట్టేస్తున్నారని, తెలియని వారి నుంచి ఎలాంటి ఆఫర్లు వచ్చినా, ఓటీపీలు అడిగినా ఇవ్వరాదని అన్నారు. మోసపోయినట్లు గ్రహిస్తే వెంటనే పోలీసులను ఆశ్రయించాలన్నారు.

ఏఓ ఆఫీస్‌కు తాళం

ఆందోళన చేపట్టిన మండల రైతులు



తాళం వేసి ఉన్న ఏఓ కార్యాలయం

ధారూరు: మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు చేపట్టిన సూర్యప్రకాశ్ కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదంటూ గురువారం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సిబ్బందిని ప్రశ్నిస్తే రైతు వేదికలో ఉన్నారని, ఫీల్డ్ విజిట్ వెళ్లారనే సమాధానం చెబుతున్నారని వాపోయారు. కార్యాలయం మాత్రం ఎప్పుడు తాళంతో దర్శనమిస్తుందని అన్నదాతలు విచారం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్న ఏఓ ఎప్పుడు ఎక్కడ కనిపిస్తారో తెలియని దుస్థితి దాపురించిందన్నారు. ప్రస్తుతం సబ్సిడీ నీళ్ల జొన్నలు వచ్చాయని, వాటిని ఎవరికి ఎలా ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొందని గగ్గోలు పెట్టారు. ఏఓ విషయంలో పై అధికారులు స్పందించి రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు.

కార్యాలయాన్ని మార్చాలి

ధారూరు మండల కేంద్రానికి కిలోమీటర్ దూరంలో జన సంచారం లేని చోట రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఏఓ కార్యాలయాన్ని వెంటనే మార్చాలని రైతులు డిమాండ్ చేశారు. మండలానికి చెందిన రైతులు, ప్రజలు కార్యాలయాలకు నిత్యం వందల సంఖ్యలో వస్తుంటారని, అందరికీ అందుబాటులో ఉన్న చోటుకు ఏఓ కార్యాలయాన్ని తరలించాలన్నారు. మహిళా పొదుపు సంఘం కార్యాలయం ఖాళీగా ఉందని, అందులోకి ఏఓ కార్యాలయాన్ని మార్చాలని సూచించారు.

పొలం పనులకు వెళ్తుండగా..

లారీ–బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



ఘటనా స్థలిలో పడి ఉన్న శాంతకుమార్ మృతదేహం

పరిగి: పొట్టకూటి కోసం నగరానికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తున్న ఓ కార్మికుడిని రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది. ఈ విషాద సంఘటన గురువారం ఉదయం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా సేడెం తాలూకా మాల్కెడ్ గ్రామానికి చెందిన శాంతకుమార్(36) బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. స్వగ్రామంలో పొలం పనుల నిమిత్తం ఉదయం నగరం నుంచి తన బైక్‌పై గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో పరిగి పట్టణ సమీపంలోని ఏబీ ప్లాజా వద్ద కర్ణాటక నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఆయన్ని ఢీకొట్టింది. దీంతో శాంతకుమార్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బాబాయి నర్సప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎంఎల్‌హెచ్‌పీల నియామకం



నియామకపత్రాలు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

అనంతగిరి: జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో గురువారం 14మంది నూతన ఎంఎల్‌హెచ్‌పీలకు నియామకపత్రాలు అందజేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరవణ తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అండ్ రోస్టర్ ప్రకారం వీరిని నియమించామని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, విధులను నిర్లక్ష్యం చేయొద్దని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు జీవరాజు, రవీంద్ర పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

ఏడీఏ శంకర్ రాథోడ్



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

దుద్యాల్: మండలంలోని పోలేపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన పంటలను కొడంగల్ ఏడీఏ శంకర్ రాథోడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ పొలాల్లో సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర నమోదు చేయించుకోవాలని సూచించారు. తమ పొలంలో సాగు చేసిన పంటనే తప్ప ఇతరుల పంటను నమోదు చేయించరాదని చెప్పారు. పంట నమోదులో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. కార్యక్రమంలో ఏఈవో మాణిక్య శ్రీ, రైతులు ఉన్నారు.

పది మంది జూదరుల అరెస్టు

బంట్వారం: మండల పరిధిలోని మంగ్రాస్‌పల్లి శివారులో పేకాట స్థావరంపై బంట్వారం పోలీసులు గురువారం దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ శ్రీశైలం యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కుపల్లి, మంగ్రాస్‌పల్లికి చెందిన 10 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో స్థావరంపై దాడులు నిర్వహించారు. వారి వద్ద నుంచి రూ.4వేల నగదు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బొంరాస్‌పేట: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగి నగదుతోపాటు పెట్రోల్‌ను దొంగిలించారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని బురాన్‌పూర్‌లో హోటల్ బాలరాజు ఇంటి తాళం పగులగొట్టి రూ.5 వేల నగదు, 20 లీటర్లున్న పెట్రోలు డబ్బాను అపహరించారు. కుటుంబమంతా కర్ణాటకలోని బంధువుల వద్దకు వెళ్లగా గురువారం సాయంత్రం వచ్చి చూసుకున్నారు. దీంతో బాధితుడు విచారం వ్యక్తం చేశాడు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై ఎండీ రవూఫ్ చెప్పారు.

కలెక్టర్‌కు న్యూయర్ విషెస్



కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ట్రెసా బృందం

అనంతగిరి: నూతన సంవత్సరం పురస్కరించుకుని గురువారం జిల్లాకు చెందిన ఆయా విభాగాల అధికారులు, వారి సిబ్బందితో కలిసి కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా ట్రెసా ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీఓ వాసుచంద్ర, ట్రెసా జిల్లా ప్రధాన కార్యదర్శి విజయేందర్, కలెక్టరేట్ విభాగం అధ్యక్షుడు దీపక్, ఏఓ ఫర్హీన్ ఖాతైన్, తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, వెంకటేష్‌ప్రసాద్, నైమాత్ అలీ, జయరాం, ఆనంద్‌రావు, గణేష్, సాజిదాబేగం, వెంకటేశ్వరి పలువురు డిప్యూటీ తహసీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా ఎంపీడీఓల సంఘం ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్, డీపీఓ జయసుధ సమక్షంలో కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సమాజంలో గురువుల పాత్ర కీలకం

సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు టౌన్: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయ ఆవరణలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ యువత చేతిలో ఉందని, వారిని సన్మార్గంలో నడపడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. సమాజ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కోశాధికారి కరణం లక్ష్మీకాంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాములు, ఆనందం, నాయకులు శ్రీశైలం, బస్వరాజ్, వినోద్, రవి, రాజేశ్, సంతోష్, వీరేశం, ప్రదీప్, జనార్దన్‌రెడ్డి, సిద్రామేశ్వర్, అనిల్ పాల్గొన్నారు.

ఎంపీడీఓల సంఘ సమావేశం

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సమావేశంలో ఎంపీడీఓలు

దోమ: మండల పరిషత్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా దోమ మండల ఎంపీడీఓ మహేష్ బాబు ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన సంఘ ఎన్నిక కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడిగా మహేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా నవాబుపేట్ ఎంపీడీఓ అనురాధ, కోశాధికారిగా ధారూర్ ఎంపీడీఓ నర్సింలు, సభ్యులుగా వెంకన్న, విశ్వప్రసాద్, ఉషశ్రీ, శ్రీరాములు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా మహేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలను ప్రజలకు చేరవేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

నిశ్చితార్థం జరిగిన వారం రోజులకే..

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పరిగి: మరికొద్ది రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కబోయే యువకుడిని గుర్తు తెలియని వాహనం పొట్టన పెట్టుకుంది. ఈ ఘటన పరిగి మండలం సాలిప్పలబాటతండా సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొంరాస్‌పేట మండలం మదనపల్లి గ్రామానికి చెందిన చాకలి అశోక్‌కుమార్(30) నగరంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సొంతూరు నుంచి బైక్‌పై పరిగి వైపు వెళ్తుండగా సాలిప్పలబాటతండా సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి గత వారం రోజుల క్రితమే నిశ్చితార్థం అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌ను అడగగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ



ఎమ్మెల్యే బీఎంఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ

తాండూరు: తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి కలిశారు. గురువారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డీఎస్పీతో పాటు పట్టణ సీఐ సంతోష్, కరన్‌కోట్ ఎస్సై విఠల్‌రెడ్డిలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తాండూరు సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే పోలీసు అధికారులకు సూచించారు. కరన్‌కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నారి కిడ్నాప్ అయిన వెంటనే స్పందించి చిన్నారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చడం పట్ల పోలీసు అధికారులను అభినందించారు.

క్రమబద్ధీకరించాలని ధర్నా



సీఎం, మంత్రుల ఫేస్ మాస్కులు ధరించిన ఎస్‌ఎస్‌ఏలు

28వ రోజుకు చేరిన ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మె

అనంతగిరి: విద్యాశాఖలో పనిచేస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు చేపడుతున్న సమ్మె గురువారానికి 28వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరుల ఫొటోల ఫేస్ మాస్కులు ధరించి బైఠాయించి రెగ్యూలర్ చేయాలని నినాదాలు చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గాంగ్యనాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాలన్నారు. వెంటనే ఎస్‌ఎస్‌ఏను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యూలర్ చేయాలన్నారు. తక్షణం పే స్కేలు అమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమిస్తామన్నారు. ధర్నాకు బీసీ సంఘం జాతీయ కార్యవర్గసభ్యుడు రాజ్‌కుమార్ మద్దతు తెలిపారు. అనంతరం ఆర్డీఓ వాసుచంద్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ సంఘం నాయకులు ప్రభావతి, శేఖర్, శ్రీశైలం, రవికుమార్, రాజేశ్వరి, ఆశలతా, ఫాతిమా, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.